సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం । 27 । జులై । 2024



ప్రమాదఘంటికలు మోగిస్తున్న గోదావరి -10లో»

గోదావరి రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను దాటింది.



సేంద్రియ ఎరువులతో పర్యావరణ పరిరక్షణ

పర్యావరణ పరిరక్షణకు రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని మార్నేని రవీందర్ రావు అన్నారు. -10లో»

గరిష్టం/కనిష్టం 28.2^{0} /24.1^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిలిచిన బొగ్గు ఉత్పత్తి



మల్హర్: గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లోకి భారీగా వర్షపునీరు చేరింది. దీంతో శుక్రవారం బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. వర్షం కారణంగా 1.30 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ, 60వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిపోయినట్లు ఏఎమ్మార్ కంపెనీ ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పలువురు తహసీల్దార్ల బదిలీలు

భూపాలపల్లి: జిల్లాలోని పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రాహుల్‌శర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన వారు తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశాలిచ్చారు. గణపురం, చిట్యాల మండలాల తహసీల్దార్లు మురళీధర్‌రావు, ఖాజా మొహినొద్దీన్‌లను కలెక్టరేట్‌కు, రేగొండ తహసీల్దార్ ఎం.సత్యనారాయణస్వామిని గణపురం, పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న సూపరింటెండెంట్ కె.స్వేతను రేగొండ తహసీల్దార్‌గా, పలిమెల తహసీల్దార్ ఎస్.హేమను చిట్యాలకు, భూపాలపల్లి తహసీల్దార్ ఎం.అనిల్‌ను పలిమెల(ఎఫ్ఏసీ) తహసీల్దార్‌గా, పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న నాయబ్ తహసీల్దార్ పి.అంజలిని భూపాలపల్లి తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పెరుగుతున్న వరద ఉధృతి



పలిమెల: ప్రాణహిత, ఇంద్రావతి, గోదావరిలో వరద ఉధృతి భారీగా పెరగడంతో ఇప్పటికే మండలంలోని ముకునూరు తోగు (వాగు) వద్ద ఉన్న లోలెవల్ కాజ్‌వే పూర్తిగా నీట మునిగింది. మండలంలోని లెంకలగడ్డ వద్ద గల బండల వాగుకు సైతం ఇలా వరద పెరిగితే నీట మునిగే ప్రమాదం ఉందని, ప్రజలు రాత్రి వేళల్లో ప్రయాణం చేయకూడదని అధికారులు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ హేమ, ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి వాగు వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. వరద ఉధృతి తీవ్రంగా ఉన్నందున ప్రజలు, మత్స్యకారులు వాగులు, గోదావరికి వెళ్లవద్దని సూచించారు.

అద్దెకు బస్సులు సిద్ధం

భూపాలపల్లి: రానున్న రోజుల్లో పెళ్లి ముహూర్తాలు అధికంగా ఉన్నందున బస్సులను అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచినట్లు ఆర్టీసీ భూపాలపల్లి డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రజలు సురక్షితమైన ప్రయాణం, అతి తక్కువ ఖర్చుతో వివాహాలు, శుభకార్యాలు, తీర్థయాత్రలకు ఆర్డినరీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సుల్లో వెళ్లేందుకు బస్సులను అద్దెకు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 99592 26707, 97019 67519 సెల్ నంబర్లను సంప్రదించాలని డీఎం సూచించారు.

విద్యా భరోసా పథకాన్ని అమలు చేయాలి



భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో విద్యా భరోసా పథకాన్ని అమలుచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. విద్యారంగానికి ఏడు శాతం నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి.. ఇప్పుడు కేవలం ఏడు శాతం కేటాయించి చిన్నచూపు చూసిందన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా విద్యా భరోసా పథకం కింద ప్రతి విద్యార్థికి ఐదు లక్షల రుణ సహాయం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు హామీ నిలుపుకోలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఎనిమిది వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఒద్దుల సాకేత్‌రెడ్డి, సంపత్, రాజేష్, దిలీప్, సాయి, లావణ్య పాల్గొన్నారు.

చిన్న కమతాలకు ఆలవాలం



రహదారుల సాంద్రతలోనూ వరంగల్ మెరుగే

- తలసరి ఆదాయంలో జయశంకర్ భూపాలపల్లి బెస్ట్
- 'కంపా' నిధుల ఖర్చులోనూ ముందంజ
- జీడీడీపీ పరంగా హనుమకొండ బెటర్
- తెలంగాణ రాష్ట్ర సామాజిక, ఆర్థిక నివేదిక చెబుతున్నదిదే..

సాక్షి, వరంగల్:

రాష్ట్రంలో సాగు చేసే భూముల్లో చిన్న కమతాలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వరంగల్ మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 33 జిల్లాలుంటే 31వ స్థానంలో ఉందని రాష్ట్ర సామాజిక, ఆర్థిక నివేదిక తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వారీగా చూసుకుంటే.. తలసరి ఆదాయంతో పాటు అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, పచ్చదనం పెంపునకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న నిధులు 'కంపా' (కంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ) ఖర్చులో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ముందుంది. అదే సమయంలో తలసరి ఆదాయంలో రాష్ట్రంలో ఐదో స్థానం, 'కంపా' నిధుల ఖర్చులో మూడో స్థానంలో ఉంది. అదే సమయంలో రహదారుల విషయానికొస్తే వరంగల్ జిల్లాలోనే రోడ్డు సాంద్రత ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో ఐదో స్థానంలో ఉంటే ఉమ్మడి వరంగల్ జిల్లాకొస్తే తొలి స్థానంలో ఉంది. జీడీడీపీ పరంగా చూసుకుంటే హనుమకొండ జిల్లా రాష్ట్రంలో 14వ స్థానంలో ఉంటే.. ఉమ్మడి వరంగల్‌కు వచ్చేసరికి ప్రథమ స్థానంలో ఉందని గురువారం విడుదల చేసిన నివేదిక పేర్కొంది.

చిన్న కమతాల రైతులే ఎక్కువ..

2021–22 (11వ వ్యవసాయ గణన ప్రకారం) చిన్న భూకమతాలు చేసే రైతులే ఎక్కువగా ఉన్నారు. జయశంకర్ జిల్లాలో 1,27,084 మంది 1,07,013 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 1,88,808 మంది 1,63,626 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 1,60,803 మంది 1,19,183 ఎకరాలు, హనుమకొండ జిల్లాలో 1,53,783 మంది 1,15,336 ఎకరాలు, జనగామ జిల్లాలో 1,79,067 మంది 1,69,991 ఎకరాలు, ములుగు జిల్లాలో 78,983 మంది 72,517 ఎకరాలున్నట్లు పేర్కొంది. ఆతర్వాత ఉమ్మడిగా కూడా కొన్ని వందల ఎకరాలు ఉన్నట్లుగా వెల్లడించింది.

తలసరి ఆదాయంలో జయశంకర్ జిల్లా ఫస్ట్..

సామాజిక, ఆర్థిక నివేదిక తాజా గణాంకాల ప్రకారం.. అన్ని రకాల వస్తువులు, సేవల ద్వారా వచ్చే ఆదాయాన్ని (ఉత్పత్తి అయ్యే డబ్బు) ఒక్క జిల్లాలోని పౌరులందరికీ విభజిస్తే ఒక్కో పౌరుడికి వచ్చే వాటాను ఆ జిల్లా తలసరి ఆదాయంగా పేర్కొంటారు. 2022–23 సంవత్సరం ప్రకారం చూసుకుంటే.. ఉమ్మడి జిల్లాలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రూ.2,71,555తో తొలి స్థానంలో ఉంది. ఆతర్వాత రూ.2,22,640తో వరంగల్ జిల్లా, రూ.2,17,222తో జనగామ జిల్లా, రూ.1,99,598తో మహబూబాబాద్ జిల్లా, రూ.1,97,539తో ములుగు జిల్లా, రూ.1,86,784తో హనుమకొండ జిల్లా ఉంది. హనుమకొండ జిల్లా రాష్ట్రపరంగా చూసుకుంటే.. 30వ స్థానంలో ఉండడం గమనార్హం.

వరంగల్‌లో చిన్న కమతాలే ఎక్కువ

రాష్ట్రంలో సగటు భూకమతాల విస్తీర్ణం ఒక హెక్టార్ నుంచి 0.89 హెక్టార్లకు తగ్గింది. కుటుంబాల విభజనతో భూముల పంపకంతో పాటు కొత్తగా సాగు, జీవనోపాధి కోసం సొంతంగా భూముల కొనుగోళ్లకు మొగ్గు చూపడం తదితర కారణాలతో చిన్న కమతాలు పెరుగుతున్నట్లు ఈ నివేదిక పేర్కొంది. 2.47 ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణం గల భూమిని సన్నకారు, 2.48 నుంచి 4.94 ఎకరాలుంటే దాన్ని చిన్నకారు, 4.95 ఎకరాల నుంచి 9.88 ఎకరాలుంటే పాక్షిక మధ్య తరహా, 9.89 నుంచి 24.77 ఎకరాలుంటే మధ్య తరహా, 24.78 ఎకరాల కంటే పైన ఉంటే పెద్ద భూకమతంగా పేర్కొంటున్నారు. అయితే రాష్ట్రంలో కరీంనగర్, మెదక్ జిల్లాల మాదిరిగానే వరంగల్ జిల్లాలోనూ చిన్న కమతాలతో సేద్యం ఎక్కువగా జరుగుతోందని వెల్లడించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వారీగా వ్యవసాయ భూమి హెక్టార్లలో సగటున చూస్తే జనగామ జిల్లాలో 0.95 హెక్టార్లు, ములుగు జిల్లాలో 0.92 హెక్టార్లు, మహబూబాబాద్ జిల్లాలో 0.87 హెక్టార్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 0.85 హెక్టార్లు, హనుమకొండ జిల్లాలో 0.75 హెక్టార్లు, వరంగల్ జిల్లా 0.74 హెక్టార్లతో చివరి స్థానంలో ఉంది.

వరంగల్ రోడ్లు బహుబాగు..

రాష్ట్రంలో రహదారుల విషయానికొస్తే 100 చదరపు కిలోమీటర్లకు 1,332.7 కిలోమీటర్లతో అత్యధిక రోడ్డు సాంద్రత హైదరాబాద్‌లో ఉంటే.. వరంగల్ జిల్లా 129.2 కిలోమీటర్లతో ఐదో స్థానంలో నిలిచింది. జాతీయ రహదారులు, గ్రామీణ ప్రాంత రోడ్లు, జిల్లా రోడ్లు, రాష్ట్ర రహదారులు ఉండి రోడ్లు బాగున్నాయని నివేదిక పేర్కొంది. ఆతర్వాత 100 చదరపు కిలోమీటర్లకు హనుమకొండ 121.9 కిలోమీటర్లతో ఆరో స్థానంలో, జనగామ జిల్లా 114.6 కిలోమీటర్లతో తొమ్మిదో స్థానంలో, మహబూబాబాద్ జిల్లా 95.9 కిలోమీటర్లతో 20వ స్థానంలో, జయశంకర్ జిల్లా 71 కిలోమీటర్లతో 28వ స్థానంలో, ములుగు జిల్లా 41.3 కిలోమీటర్లతో 33వ స్థానం రాష్ట్రంలోనే చిట్టచివరి స్థానంలో నిలిచింది.

'కంపా' ఖర్చులో జయశంకర్ జిల్లా..

2014–15 నుంచి 2023–24 వరకు రూ.2,407.77 కోట్లు కంపా నిధులు మంజూరయ్యాయి. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు వచ్చిన నిధుల్లో భూపాలపల్లి జిల్లా 81.88 శాతం నిధులు, హనుమకొండ జిల్లా 71.55 శాతం, వరంగల్ జిల్లా 64.55 శాతం నిధులు, మహబూబాబాద్ 63.69 శాతం, ములుగు జిల్లా 61.27 శాతం, జనగామ జిల్లా 58.59 శాతం నిధులు ఖర్చు చేశాయని సదరు నివేదిక పేర్కొంది. అన్ని జిల్లాల్లో విస్తరించిన అడవుల్లో సాసర్ పిట్లు, సోలార్ పంప్ సెట్లు, నీటి కుంటలు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో వన్యప్రాణులకు తాగునీరు లభించడంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశముంది. కందకాల నిర్మాణం, నర్సరీల ఏర్పాటు, ప్లాంటేషన్ నిర్వహణ వంటి పనులు కూడా అటవీశాఖ చేస్తోంది.

జీడీడీపీలో హనుమకొండే టాప్

వ్యవసాయ, తయారీ రంగం, విద్యుత్, గ్యాస్ పంపిణీ, గనుల తవ్వకం, అడవులు, చేపల వేట, హోటల్, నిర్మాణం, వాణిజ్యం, సమాచార సంబంధాలు, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, బీమా, వాణిజ్య సేవలు, సామాజిక, ప్రజా సేవలు.. ఇలా ఎనిమిది రంగాల నుంచి జీడీపీ గణాంకాల్ని సేకరిస్తారు. జిల్లాలో ఉత్పత్తి అయిన సరుకులు, సేవల మొత్తం విలువను గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీడీపీ) అంటారు. ఈప్రకారం చూసుకుంటే.. 2022–23 సంవత్సరానికి ఉమ్మడి వరంగల్‌లో రూ.23,869 కోట్లతో హనుమకొండ జిల్లా తొలి స్థానంలో ఉంది. ఆ తర్వాత రూ.18,887 కోట్లతో వరంగల్ జిల్లా, రూ.18,172 కోట్లతో మహబూబాబాద్ జిల్లా, రూ.13,809 కోట్లతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రూ.13,593 కోట్లతో జనగామ జిల్లా ఉంది. ములుగు జిల్లా రూ.6,914 కోట్లతో చిట్టచివరి (రాష్ట్రంలోనూ 33వ) స్థానంలో ఉంది.

పిక్నిక్ టూర్‌లా కాళేశ్వరం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే..
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కాళేశ్వరం టూర్ ఒక పిక్నిక్ టూర్‌లా ఉందని, కాళేశ్వరం పర్యటన పేరిట ప్రజలను మభ్యపెడితే నమ్మే పరిస్థితిలో లేరని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎద్దేవా చేశారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. కేసీఆర్ కుటుంబానికి వచ్చిన మాటలు ఎవ్వరికీ రావని, వారి మాటలన్నీ పచ్చి అబద్ధాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాయ మాటలు చెప్పి ప్రజల్ని మోసం చేశారని కాలం గడిపారని చెప్పారు. అధికారం దూరం కావడంతో కాళేశ్వరం మేడిగడ్డ పర్యటనల పేరిట వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీఆర్ఎస్ పార్టీ చూస్తుందని తెలిపారు. హామీ ప్రకారం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి తీరుతామన్నారు. జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ఒక ఎకరానికి కూడా నీరు అందించలేని బీఆర్ఎస్ పార్టీకి జిల్లా ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు దేవన్, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, స్వామి, నాయకులు చల్లూరి మధు, చల్లూరి సమ్మయ్య, అప్పం కిషన్, ఆకుల మహేందర్, పిప్పాల రాజేందర్, క్యాతరాజు సాంబమూర్తి, కమల పాల్గొన్నారు.

ఎండు గంజాయి దహనం



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే



దహనమవుతున్న ఎండు గంజాయి

భూపాలపల్లి: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుకున్న ఎండు గంజాయిని శుక్రవారం దహనం చేసినట్లు ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. జిల్లాలో 2020 సంవత్సరం నుంచి రూ.1.59కోట్ల విలువ గల 636 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని 25 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గంజాయిని శుక్రవారం డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కోర్టు ఉత్తర్వుల ప్రకారం సుబేదారిలోని కాకతీయ మెడిక్లిన్ వద్ద దహనం చేయించినట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణనాయక్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో అధిక లాభాలు

డీఆర్‌డీఓ నరేశ్

రేగొండ: పుట్టగొడుగుల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నరేశ్ అన్నారు. పుట్టగొడుగుల పెంపకంపై మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టగొడుగుల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పూర్తిచేసుకున్న కుటుంబాలలోని సభ్యులు నైపుణ్యత, శిక్షణ కార్యక్రమాలు ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన డ్రాగన్ ఫ్రూట్ పండ్ల తోట, జమాయిల్ తోటలను పరిశీలించారు. రైతులకు తోట సాగుపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జమీర్‌పాషా, ఏపీఎం రాజు, ఈసీ మధుకర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు ప్రకాశ్, రాజు పాల్గొన్నారు.



డ్రాగన్ ఫ్రూట్ పండ్ల తోటను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నరేశ్

ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ చైర్‌పర్సన్

చిట్యాల: ఇటీవల ఎన్నికైన చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవితో పాటు పాలకవర్గం సభ్యులు శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మార్కెట్ పాలకవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎండీ.రఫీ, పాలకవర్గ సభ్యులు మేరుగు లక్ష్మీ, చెన్న చందర్, మటిక రవీందర్, భూపాలపల్లి మార్కెటింగ్ అధికారి కనకశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

29నుంచి పరిరక్షణ యాత్ర

భూపాలపల్లి అర్బన్: సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 29నుంచి సింగరేణి పరిరక్షణ యాత్రను నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ప్రారంభమై ఆగస్టు 3వ తేదీన భూపాలపల్లి ఏరియాకు రానున్నట్లు తెలిపారు. 5వ తేదీన కొత్తగూడెంలో యాత్ర ముగియనున్నట్లు తెలిపారు. 8రోజుల పాటు సింగరేణి వ్యాప్తంగా యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు రాజయ్య, రమేష్, రాజేందర్, రాజయ్య పాల్గొన్నారు.

'కాళేశ్వరం'లో కేటీఆర్ టీం

- కాళేశ్వరాలయం, కన్నెపల్లి పంపు హౌస్, మేడిగడ్డను సందర్శించిన బృందం
- ప్రాజెక్టు ఇంజనీర్లను వివరాలు అడిగిన కేటీఆర్
- ప్రాజెక్టు వద్దే మీడియా సమావేశం.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం
- నాలుగు గంటలపాటు సాగిన పర్యటన

సాక్షి ప్రతినిధి, వరంగల్/కాళేశ్వరం:

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు బృందం కాళేశ్వరం ప్రాజెక్టుల్లో బిజీబిజీగా పర్యటించింది. గురువారం కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో పర్యటించిన ఈ బృందం శుక్రవారం ఉదయం మంచిర్యాల జిల్లా ఇందారం గుండా మహదేవపూర్ మండలం కన్నెపల్లి (లక్ష్మి) పంపుహౌస్‌కు చేరుకుంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రాజెక్టులు, రిజర్వాయర్లను సందర్శించామని ప్రకటించిన కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, జి.జగదీశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, చామకూర మల్లారెడ్డి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, కోరుకంటి చందర్, సుంకె రవిశంకర్, కోవ లక్ష్మీ తదితరులు ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కీలకమైన మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్‌లను సందర్శించిన ఈ బృందం నాలుగు గంటల పాటు గడిపింది.





లక్ష్మీపంపుహౌస్ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, సబితాఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు, త్రివేణి సంగమం వద్ద గోదావరికి సారె సమర్పిస్తున్న కేటీఆర్ తదితరులు

కాళేశ్వరాలయం నుంచి పంపుహౌస్‌కు...

బీఆర్ఎస్ బృంద సభ్యులు కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయానికి ఉదయం 10.02 గంటలకు చేరుకున్నారు. వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అక్కడ పూజలు చేశారు. త్రివేణి సంగమ గోదావరి నదికి సారెతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్‌కు 10.45గంటలకు చేరుకున్నారు. చెడిపోయిన స్థానంలో బిగించిన పంపులను చూశారు. అక్కడ ఇరిగేషన్ ఇంజనీర్లతో మాట్లాడారు. ఎస్ఈ కరుణాకర్, ఈఈ తిరుపతిరావు బీఆర్ఎస్ బృందానికి లక్ష్మీ పంపుహౌస్‌లోని మోటార్లు, పంపుల గురించి వివరించారు. ప్రాణహిత ద్వారా లక్షల క్యూసెక్కుల వరద వస్తుంటే.. ఎందుకు లిఫ్ట్ చేయడం లేదని కేటీఆర్ అధికారులను అడిగారు. ఇందుకు ప్రభుత్వ నిర్ణయం, ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు లిఫ్ట్ చేస్తామని అధికారులు బదులిచ్చారు. అక్కడినుంచి నేరుగా అప్రోచ్ కెనాల్ ద్వారా ఫోర్‌బే వద్దకు వచ్చే గోదావరి వరద నీటిని పరిశీలించారు. అక్కడ కొద్దిసేపు మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. బృందంతో 11.50 గంటలకు కన్నెపల్లి నుంచి మేడిగడ్డ బ్యారేజీకి వెళ్లారు. బ్యారేజీ గుండా తరలిపోతున్న వరదను పరిశీలించారు. బ్యారేజీ పైనుంచి సారెను సమర్పించి పూజ చేశారు. 7వ బ్లాక్‌లో గతేడాది అక్టోబర్ 21న కుంగిన 20వ పియర్ వద్దకు చేరుకొని పరిశీలించారు. అక్కడ మళ్లీ మీడియాతో మాట్లాడారు. గంటకుపైగా బ్యారేజీ వద్ద పరిశీలన చేసి మధ్యాహ్నం 1.50 గంటలకు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లికి వెళ్లారు.

పంపింగ్ చేయకపోవడంపై ఆగ్రహం..

ఈసందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. కాళేశ్వరం నుంచి నీళ్ల పంపింగ్ నిలిపివేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశం కోసం ప్రజలు, రైతులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఆగస్టు 2లోపు కాళేశ్వరం ప్రాజెక్టులోని మోటార్లను ఆన్ చేసి నీటిని ఎత్తిపోయకుంటే 50 వేల మంది రైతులతో కలిసి మోటార్లను తామే ఆన్ చేస్తామని అల్టిమేటం ఇచ్చారు.



కాళేశ్వరంలో నంది విగ్రహం వద్ద కేటీఆర్, మల్లారెడ్డి, గంగుల, సబిత తదితరులు

పోలీసుల పహారా..

కాళేశ్వరం పంపుహౌస్, బ్యారేజీల పర్యటనకు రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ బృందం రావడంతో జిల్లా పోలీసుల పహారా కొనసాగింది. డీఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డితో పాటు సీఐలు, ఎస్సైలతో పాటు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

కాళేశ్వరానికి మొదటిసారి కేటీఆర్..

కేటీఆర్ మొదటిసారి కాళేశ్వరాలయంతోపాటు కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్‌కు వచ్చారు. ప్రాజెక్టు నిర్మాణ భూమిపూజ సమయంలో, ఎత్తిపోతలు ప్రారంభించిన సమయంలోనూ రాలేదు. ఆయనను చూసేందుకు స్థానికులు పోటీపడ్డారు.

సుమన్, బీఆర్ఎస్ మధ్య వాగ్వాదం

కాళేశ్వరాలయంలోకి కేటీఆర్‌తోపాటు నాయకులు వెళ్తుండగా మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన బేరి సత్యనారాయణ అనే బీఆర్ఎస్ నాయకుడితో దారికి అడ్డుగా ఉన్నావంటూ చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వాగ్వాదానికి దిగాడు. 'నువ్వెంత అంటే నువ్వెంత' అంటూ ఒకరినొకరు దుర్భాషలాడుకున్నారు. దీంతో ఈవిషయం ఆలయం వద్ద తీవ్ర చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

కేయూ బీఫార్మసీ సెమిస్టర్ పరీక్షలు షురూ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో ఈ పరీక్షల నిర్వహణ తీరును కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నాగరాజు పరిశీలించారు. వీరి వెంట కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ప్రసాద్ ఉన్నారు.

కొనసాగిన రిజిస్ట్రేషన్ల జోరు

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగింది. గురువారం 246 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోగా ఖజానాకు 2.10కోట్ల ఆదాయం సమకూరగా, అదే జోరులో శుక్రవారం కొనసాగి 229 దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్లు రాజు, అమ్జద్ పూర్తి చేశారు. దీంతో ఖజానాకు రూ.కోటి 90లక్షల ఆదాయం సమకూరినట్లు సమాచారం. రాత్రి 7.30నిమిషాల వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. శనివారం సైతం ఇదే జోరు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

కుక్కకాటుతో మహిళ మృతి



పూలమ్మ(ఫైల్)

మరిపెడ: మానుకోట జిల్లా మరిపెడ మండలం ఎడ్జర్లకు చెందిన మహిళ కుక్క కాటుకు గురై చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ నెల 5వ తేదీన ఎడ్జర్లకు చెందిన జంగం పూలమ్మ(40) గ్రామంలో నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వీధికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. అయితే అదే రోజు గ్రామానికి చెందిన చిన్నారి నారమల్ల దివ్యను సైతం కుక్క కరవగా ప్రస్తుతం చికిత్స పొందుతోంది.

మహ్మద్‌గౌస్‌పల్లిలో ముగిసిన అశోక్ అంత్యక్రియలు

ములుగు రూరల్: భద్రాద్రి కొత్తగూడెం- ములుగు జిల్లా సరిహద్దుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్ అంత్యక్రియలు శుక్రవారం మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లిలో నిర్వహించారు. అశోక్ సొంత గ్రామం భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామమైనప్పటికీ అతని సోదరుడు నల్లమారి కుమారస్వామి బతుకుదెరువు నిమిత్తం మహ్మద్‌గౌస్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. బుద్దారంలో అశోక్ కుటుంబ సభ్యులు ఎవరూ లేక పోవడంతో ఆయన సోదరుడు కుమారస్వామి అశోక్ మృతదేహాన్ని నేరుగా గ్రామంలోని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రమాదఘంటికలు మోగిస్తున్న గోదావరి

- మూడో హెచ్చరికకు చేరువలో వరద ఉధృతి
- సమ్మక్క సాగర్ వద్ద 84.50మీటర్ల నీటి మట్టం

ఏటూరునాగారం: గోదావరి క్రమం పెరుగుతూ ప్రమాదఘంటికలను మోగిస్తుంది. మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 15.910 మీటర్లకు చేరుకొని రెండో ప్రమాద హెచ్చరికను దాటింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గ్రామాల్లో గోదావరి రెండో ప్రమాద హెచ్చరికను టాంటాం చేశారు. గోదావరి వరద 17.360కి మీటర్లకు చేరితే అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. లోతట్టు ప్రాంతాలైన ఒడవాడ, మానసపెల్లి, రామన్నగూడెం, రామ్ నగర్ గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు లోతట్టు ప్రాంతాల ప్రజలను దాటించడానికి మర పడవలతో గోదావరి వద్ద సిద్ధంగా ఉన్నారు. ఇదిలా ఉండగా.. రామన్నగూడెం గోదావరి పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతిని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పరిశీలించారు. తహసీల్దార్ జగదీశ్, సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ ఉన్నారు.

సమ్మక్క సాగర్ వద్ద 84.50మీటర్ల నీటి మట్టం

కన్నాయిగూడెం: తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి గత మూడు రోజుల నుంచి తగ్గి గురువారం నుంచి మళ్లీ పెరుగుతోంది. బ్యారేజీలోకి ఉదయం 9,83,500 క్యూసెక్కుల నీరు చేరగా సాయంత్రం 10,74,200క్యూసెక్కులు చేరింది. బ్యారేజీ వద్ద 59గేట్లు ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 84.50మీటర్ల నీటిమట్టం ఉంది. దేవాదుల ఇన్‌టెక్ వెల్ వద్ద 86మీటర్ల నీటి మట్టం కొనసాగుతుంది.

ఉధృతంగా ప్రాణహిత..

కాళేశ్వరం: కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తుంది. శుక్రవారం కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి పుష్కరఘాట్‌ను తాకుతూ 12.100మీటర్ల ఎత్తులో నీటి ప్రవాహం కొనసాగింది. దీంతో దిగువన అంబట్‌పల్లిలోని మేడిగడ్డ(లక్ష్మీ)బ్యారేజీకి వరద చేరుతోంది. అక్కడ బ్యారేజీలోకి 9,89,600లక్షల క్యూసెక్కుల వరద వస్తుంది. దీంతో మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, అన్నారం బ్యారేజీ వద్ద 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీలోని 66గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు.



ఏటూరునాగారం: రామన్నగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



వాజేడు: రహదారికి అడ్డంగా ఉంచిన దుంగ



వెంకటాపురం(కె):బోదాపురం వద్ద బ్రిడ్జిపైకి చేరిన గోదావరి వరద

రాకపోకలకు అంతరాయం

వెంకటాపురం(కె): గోదావరి వరద ఉధృతితో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం.. ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం సాయంత్రానికి మండల పరిధిలోని బోదాపురం బ్రిడ్జి పైకి, వీరభద్రవరం గ్రామ సమీపంలోని కుక్కతోగు వాగు వద్ద గోదావరి వరద రోడ్లపైకి చేరింది.

తగ్గినట్టే తగ్గి పెరుగుతున్న గోదావరి

వాజేడు: పేరూరు వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గినట్టే తగ్గి పెరుగుతోంది. గురువారం సాయంత్రం 16.10మీటర్లకు తగ్గిన గోదావరి వరద శుక్రవారం సాయంత్రానికి 17.49మీటర్లకు చేరుకుంది. పూసూరు-ఎడ్జర్లపల్లి, వాజేడు-గుమ్మడి దొడ్డి, పేరూరు-చంద్రుపట్ల, కోయవీరాపురం, రహదారులపై గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. అధికారులు మండలంలో 14 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి ఉంచారు. వాజేడు, గుమ్మడిదొడ్డి రహదారిపై అడ్డంగా దుంగలను ఉంచారు.

ఆటలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా
- ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: క్రీడాకారులు నిత్య సాధనతో ఆటలో ఎప్పటికప్పుడు సరికొత్త టెక్నిక్‌లను నేర్చుకుంటూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ (అండర్-17) బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిశాయి. గత నాలుగు రోజులుగా హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్, భీమారంలోని కిట్స్ కళాశాల ఇండోర్‌లో నిర్వహించిన చాంపియన్‌షిప్ ముగింపు వేడుకలకు సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆఫీసర్స్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీపీ విజేతలకు ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లను అందజేసి, మాట్లాడారు. తెలంగాణ నుంచి అంతర్జాతీయ, ఒలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారుల స్ఫూర్తితో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిళి రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, నిర్వహణ కార్యదర్శి డాక్టర్ జితేందర్ రెడ్డి, వరంగల్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, క్రీడా పరిశీలకుడు సుధాకర్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మోహన్‌రావు, అసోసియేషన్ బాధ్యులు టెక్నికల్ అఫీషియల్స్ కొమ్ము రాజేందర్, వైకుంఠం, రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్, విశ్వప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో సీపీ అంబర్‌కిషోర్‌ఝా, అసోసియేషన్ బాధ్యులు

విజేతలు..

మిక్స్‌డ్ డబుల్స్ బాలుర విభాగంలో..

ఆదిత్య బొమ్మకంటి, రిషితపాండే (రంగారెడ్డి) వర్సెస్ జే.శౌర్యకిరణ్, కీర్తి మంచాల(వరంగల్)ల మధ్య సాగిన తుది పోరులో పాయింట్ల తేడాతో ఆదిత్య, రిషితల జట్టు విజేతగా నిలిచింది.

బాలుర డబుల్స్‌లో..

ఫైనల్ మ్యాచ్‌లో ధృవ పెర్షిద్‌సేతి, వివేక్ బొల్లం (రంగారెడ్డి) జట్టు పై సాయిసిద్ధార్థ రాయప్రోలు, యువసూర్య జాగర్లమూడి(హైదరాబాద్) విజయం సాధించారు.

బాలుర సింగిల్స్‌లో..

సాయినాచికేత్ భట్రాజు (మెదక్)పై శశాంక్ వనమాల(రంగారెడ్డి) విజయం సాధించాడు.

బాలికల డబుల్స్‌లో..

లక్ష్మీ రిధిమ దేవినేని, సరయు సూర్యనేని(హైదరాబాద్) వర్సెస్ అనుసంజన మురళీ, శృతి గ్రేస్‌రెడ్డి (రంగారెడ్డి)ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు క్రీడాకారులు విజయం సాధించారు.

బాలికల సింగిల్స్‌లో..

కీర్తి మంచాల (జనగాం).. ఏలూరు అక్షయ చౌదరి (మెదక్)పై గెలుపొందింది.

తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు

- అదనపు డీసీపీ రవి

వరంగల్ క్రైం : ఆదాయ పన్ను రిఫండ్ (ఐటీఆర్) కోసం తప్పుడు వివరాలతో రిటర్న్స్ సమర్పిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని వరంగల్ పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి తెలిపారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆదాయ పన్ను రిటర్న్స్‌పై పోలీస్ అధికారులు, సిబ్బందికి జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఆదాయపు పన్ను అధికారి మహేందర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ వేతన ఉద్యోగులు తమ ఆదాయ పన్ను వివరాలను సమర్పించే సమయంలో తప్పుడు మినహాయింపులు, డిడక్షన్లతో ఆన్‌లైన్ రిటర్న్ సమర్పించి రావాల్సిన దానికన్నా ఎక్కువ మొత్తంలో రిఫండ్ క్లెయిమ్ చేస్తున్నట్లు ఆదాయ పన్ను విభాగం నిర్వహించిన దర్యాప్తు వెలుగు చూసిందన్నారు. పోలీస్ ఉద్యోగులు ఆదాయపన్ను రిటర్న్స్ సమర్పించే సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అందజేయాల్సిన పత్రాలు, తప్పుడు వివరాలతో ఆదాయ పన్ను రిటర్న్స్ సమర్పిస్తే ఆదాయపన్ను చట్టం క్రింద తీసుకునే చర్యలను వివరించారు. ఎక్కువ మొత్తంలో రిఫండ్ ఇప్పిస్తామంటూ ముందుకు వచ్చే దళారులను నమ్మొద్దని సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేశ్‌కుమార్, ఏఓ రామకృష్ణ, స్వామి, ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు డీసీపీ రవి

సేంద్రియ ఎరువులతో పర్యావరణ పరిరక్షణ

- టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు

హన్మకొండ: పర్యావరణ పరిరక్షణకు రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని డీఎల్‌కే బాంక్వెట్‌హాల్‌లో స్పిక్ గ్రీన్ ఫర్టిలైజర్స్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో రవీందర్ రావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు విచ్చలవిడిగా వాడడం ద్వారా భూసారం, పర్యావరణం దెబ్బ తింటుందన్నారు. పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు చేరి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఈ క్రమంలో సేంద్రియ ఎరువులు వాడడమే శ్రేయస్కరమని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్న స్పిక్ ఫర్టిలైజర్ కంపెనీని అభినందించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం శ్యామ్, స్పిక్ మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ, రీజినల్ మేనేజర్ సుబాన్, డెవలప్‌మెంట్ మేనేజర్ సురేశ్, సహకార సంఘాల సీఈఓలు, మార్క్‌ఫెడ్, టీడీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

సైబర్ మోసం.. రూ.92వేలు మాయం

మహబూబాబాద్ రూరల్: ఉన్నట్టుండి ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.92వేలు మాయమైన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వీణా ఫ్యాన్సీ కంగన్ హాల్ నిర్వాహకుడు శేషాగని శ్రీనివాస్ గురువారం రాత్రి తన సెల్ ఫోన్ ఇంట్లో పెట్టి బయటకు వెళ్లాడు. కొంత సమయానికి వచ్చి సెల్ ఫోన్ చూడగా అప్పటికే నిమిషాల వ్యవధిలో రూ.60వేలు, మరోసారి రూ.32వేలు డెబిట్ అయినట్లు సమాచారం వచ్చింది. దీంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి బాధితుడు ఆ వెంటనే సైబర్ క్రైం నంబరు 1930కు, మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశాడు. అయితే కొంతకాలంగా శ్రీనివాస్‌కు వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు మరో నంబర్‌కు ఫార్వర్డ్ అవుతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు శ్రీనివాస్

ఆలయంలో లీకేజీలను పరిశీలించిన అధికారులు

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ పైకప్పుకు లీకేజీలు ఏర్పడి వర్షపునీరు వస్తుందనే నెపంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రామప్పను సందర్శించినట్లు దేవాదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.సునిత తెలిపారు. రామప్ప ఆలయంలో కురుస్తున్న ప్రదేశాలను పరిశీలించినట్లు వెల్లడించారు. లీకేజీలకు మరమ్మతులు చేపట్టేందుకు కేంద్ర పురావస్తుశాఖ ఉన్నతాధికారులను కోరనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్, సిబ్బంది అవినాశ్‌రెడ్డి, మార్క సంతోష్ ఉన్నారు.



లీకేజీలను పరిశీలిస్తున్న అధికారులు

ఆయుష్ శాఖలో బదిలీలు

- 47 మంది వైద్యులు, 40మంది ఫార్మసిస్టులకు ఉత్తర్వులు

కాశిబుగ్గ: హైదరాబాద్‌లో ఈనెల 15, 16న ఆయుష్ శాఖలో బదిలీలు జరగగా శుక్రవారం హనుమకొండలోని వరంగల్ జెడ్పీ ఆవరణలోని ఆర్‌డీడీ కార్యాలయంలో వారికి ఉత్తర్వులను ఆర్‌డీడీ డాక్టర్ రవీనాయక్ అందజేశారు. మల్టీజోన్-1 పరిధిలోని 47మంది వైద్యులు, 40మంది ఫార్మసిస్టులు, 31 మంది మిగతా జిల్లా కేడర్ సిబ్బందికి ఉత్తర్వులు అందజేశారు. ఇందులో 28మంది ఆయుర్వేద, 13మంది హోమియో, ఆరుగురు యునాని వైద్యులు ఉన్నారు. 47 ఫార్మసిస్టులలో 22 మంది ఆయుర్వేదం, 12మంది యునాని, 3 హోమియోల్లో బదిలీలు జరిగాయి. వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలకు ఒక వైద్యురాలు, ఇద్దరు ఫార్మసిస్టులు బదిలీపై వచ్చారు. వైద్యశాలకు చెందిన ఆఫీస్ సూపరింటెండెంట్ ఆర్‌డీడీ కార్యాలయానికి వెళ్లగా, అర్‌డీడీ ఆఫీస్‌కు చెందిన ఆఫీస్ సూపరింటెండెంట్ఇక్కడికి బదిలీపై వచ్చారు.



వైద్యులకు బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న ఆర్‌డీడీ రవినాయక్

ముగిసిన ధార్మిక ప్రవచనాలు

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్క్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ వేంకటాచల ధార్మిక ప్రవచనాలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రవచకులు శ్రీమండలిక కృష్ణకుమార్ మాట్లాడుతూ శ్రీవేంకటాచల పుణ్యక్షేత్రాన్ని దర్శిస్తే సమస్యలు తీరి మోక్షమార్గం లభిస్తుందని చెప్పారు. ప్రతీ ఒక్కరు శ్రీవేంకటాచల మహత్యం తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు డింగిరి శ్రీనివాసాచార్యులు, అరుణ, దేవేందర్‌రెడ్డి, ఉపేందర్, కనపర్తి నీరజ, రఘువీర, వంగల సోమయాజు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీవేంకటాచల ధార్మిక ప్రవచనం చేస్తున్న కృష్ణకుమార్

మోటు సరసం !

- లావు కావాలని.. మలద్వారం గుండా గాలి పంపింగ్
- ఆకతాయి చేష్టలతో యువకుడు ఆస్పత్రిపాలు
- మద్యం మత్తులో బావబామ్మర్దుల పరాచకం

ఐనవోలు: బావబామ్మర్ది పరాచకాలు.. ఆటపట్టించుకోవడాలు సాధారణంగా చూస్తుంటాం.. కానీ, ఏకంగా ఓ బావబామ్మర్దుల జంట సరసం పరాకాష్టకు చేరింది. దీంతో ఓ వ్యక్తి ఆస్పత్రి పాలయ్యాడు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, ఒంటిమామిడిపల్లికి చెందిన ఓ మెకానిక్, గూడ్స్ ట్రాలీ డ్రైవర్లు స్నేహితులు. ఐనవోలుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ (27) ఈ నెల 20వ తేదీన రాత్రి మెకానిక్ షెడ్డులో ట్రాక్టర్ రిపేర్ చేయించుకుంటున్నాడు. అదే సమయంలో మిగతా ఇద్దరు అక్కడకు వచ్చారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వీరు ఆకతాయి తనంతో ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో ఐనవోలుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌ను నువ్వు బక్కగా ఉన్నావు.. లావు కావాలి.. అంటూ గేలి చేస్తూ ఆట పట్టించారు. నీకు గాలి పెట్టి దొడ్డయ్యేలా(లావు) చేస్తాం.. అంటూ పరాచకాలు ఆడుతూ చివరకు బలవంతంగా మెకానిక్ షాపులో ఉన్న హైడ్రాలిక్ ఎయిర్ ప్రెషర్ పైపు మలద్వారం వద్ద ఉంచి ఒక్కసారిగా గాలి వదిలారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ పొట్టలోకి గాలి చేరడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే టాక్టర్ డ్రైవర్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పెద్ద పేగులోకి గాలి చేరి ఉబ్బిందని ఆపరేషన్ చేయడంతో ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అయితే సదరు వ్యక్తి ఆహారం తీసుకుని.. మలవిసర్జన చేసే వరకు ఆస్పత్రిలోనే ఉండాలని, ఏదైనా సమస్య వస్తే మరోసారి ఆపరేషన్ చేయాల్సి వస్తుందని డాక్టర్లు చెబుతున్నట్లు సమాచారం. ఆస్పత్రిలో అయ్యే ఖర్చంతా ఒంటిమామిడిపల్లికి చెందిన ఇద్దరు భరిస్తున్నారు. అయితే ఆరు రోజులైనా డిశ్చార్జ్ కాకపోవడంతో విషయం స్థానికంగా అందరికీ తెలిసిపోయి.. చర్చనీయాంశంగా మారింది.

వరంగల్ మీదుగా భారత్ గౌరవ్ రైలు

- ఆగస్టు 4న 'దివ్య దక్షిణ యాత్ర' ప్రారంభం



కాశిబుగ్గ: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో భారత్ గౌరవ్ పర్యాటక రైలు వరంగల్ మీదిగా రామేశ్వరం, జ్యోతిర్లింగ, దివ్య దక్షిణ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కిషోర్ సత్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలు ఆగస్టు 4న సికింద్రాబాద్‌లో ప్రారంభమై కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, గేణిగుంట మీదుగా తిరువణ్ణామలై(అరుణాచలం) రామేశ్వరం, మధురై, కన్యకుమారి, తివేంద్రం, తిరుచ్చి, తంజావూరు సందర్శన ఉంటుందని తెలిపారు. ఈయాత్ర 8 రాత్రులు, 9 పగళ్లుగా కొనసాగుతుందని ఉదయం టీ, కాఫీ, టీఫిన్, మధ్యాహ్నం తెలుగు భోజనం, సాయంత్రం స్నాక్స్, టీ, కాఫీ రాత్రి టిఫిన్ అందిస్తారని తెలిపారు. క్షేత్రాల సందర్శన సమయాల్లో ప్రత్యేక బస, స్లీపర్ క్లాస్, నాన్ ఏసీ, ఏసీ క్లాస్‌ల వారికి ఏసీ రూమ్‌ల సదుపాయం కల్పిస్తారని తెలిపారు. రైలు ప్రతి బోగీలో ఎస్కార్ట్స్, ప్రయాణికులను దగ్గరుండి దర్శనానికి తీసుకెళ్లడం తిరిగి రైల్లోకి చేర్చే సదుపాయం ఉంటుందని తెలిపారు. రైలులో సీసీ కెమెరాలు, మైక్, లగేజీ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందని తెలిపారు. టికెట్ ఒక్కొరికీ స్లీపర్ రూ.14,250, సెకండ్ ఏసీ రూ.28,450, థర్డ్ ఏసీ రూ.21,900గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అవసరమైనవారు బుకింగ్స్ కోసం 92814 95843, 92814 95845, 82879 32229 మరిన్ని వివరాల కోసం www. irctctourism. com సంప్రదించాలని సూచించారు.

విహారం.. విషాదం కావొద్దు



ఫ్లెక్సీ కడుతున్న సిబ్బంది

వాజేడు: విహార యాత్ర విషాదం కావొద్దని తెలిపే ఫ్లెక్సీలను అటవీ శాఖ సిబ్బంది బొగత జలపాతం వద్ద శుక్రవారం ఏర్పాటు చేశారు. రేంజర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో సిబ్బంది బొగత జలపాతం చుట్టూ ఈ ఫ్లెక్సీలను కట్టారు. నీటిలోకి దిగొద్దని, నీటితో జాగ్రత్తగా ఉండాలని తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

బ్యాడ్మింటన్‌లో శౌర్యకిరణం

హనుమకొండ నుంచి అంతర్జాతీయ పోటీలకు..

- చైనాలో జరిగే ఏషియా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌నకు ఎంపిక

ఖిలా వరంగల్ : కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించాడు.. హనుమకొండకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శౌర్యకిరణ్. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపిచంద్ స్ఫూర్తిగా షటిల్ బ్యాడ్మింటన్‌లో శౌర్యకిరణ్ సత్తా చాటుతున్నాడు. పీటీసీ సీఐగా విధులు నిర్వహిస్తున్న హనుమకొండకు చెందిన రవికిరణ్ కుమారుడు శౌర్యకిరణ్ ఇంటర్ చదువుతున్నాడు. చిన్నతనంలో బ్యాడ్మింటన్‌పై ఉన్న ఆసక్తిని గమనించిన తండ్రి రవికిరణ్ తనతోపాటు గ్రౌండ్‌కు తీసుకెళ్లి సాధన చేయిస్తూ మెలకువలు నేర్పించాడు. దీంతో శౌర్యకిరణ్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించాడు. ఇటీవల రాజస్థాన్ జైపూర్, ఆంధ్రప్రదేశ్ విజయవాడ, కర్ణాటక బెంగళూరు, చెన్నైలో జరిగిన టోర్నమెంట్స్‌లో విజేతగా నిలిచి బంగారు పతకాలు సాధించి, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు పలువురి ప్రశంసలు అందుకున్నాడు. ప్రస్తుతం చైనాలో ఆగస్టు 20 నుంచి 25 వరకు జరిగే ఏషియా బ్యాడ్మింటన్ డబుల్ అండర్-17 చాంపియన్ షిప్ పోటీలకు భారత్ తరపున శౌర్యకిరణ్ ఎంపికయ్యాడు.



తల్లిదండ్రులు రవికిరణ్, నాగలక్ష్మితో శౌర్య కిరణ్



షటిల్ ఆడుతున్న క్రీడాకారుడు శౌర్య కిరణ్

విజయమే నా లక్ష్యం

మా నాన్న వద్ద బ్యాడ్మింటన్ ఆడడం నేర్చుకున్నా. పుల్లెల గోపిచంద్ శిక్షణ, ప్రోత్సాహం మరవలేనిది. ఆగస్టులో చైనాలో జరిగే అంతర్జాతీయ టోర్నమెంట్‌లో విజయం సాధించడమే నా లక్ష్యం.

\- శౌర్య కిరణ్

విజయాలు

- 2023లో ఫిబ్రవరి 5 నుంచి మే 12 వరకు రాజస్థాన్ జైపూర్‌లో జరిగిన యూనెక్స్ సన్‌రైజ్ ఇల్‌ఇండియా సబ్‌జూనియర్ (అండర్ 15-17వరకు)టోర్నమెంట్ సింగిల్స్‌లో తృతీయ స్థానం సాధించాడు.
- 2023 నవంబర్ 1 నుంచి 8 వరకు విజయవాడ (ఏపీ)లో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచాడు.
- 2023 నవంబర్ 28 నుంచి డిసెంబర్ 12వరకు కర్నాటక రాష్ట్రం బెంగళూర్‌లో జరిగిన బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ప్రథమస్థానంలో నిలిచాడు.
- 2024 జనవరి 27న చెన్నై-2023 ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఆధ్వర్యంలో డబుల్ బ్యాడ్మింటన్ క్వార్టర్ ఫైనల్, హైదరాబాద్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ -2023 రాష్ట్ర స్థాయి పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్‌లో గోల్డ్‌మెడల్ అందుకున్నాడు.
- 2024 జూలై 18 నుంచి 20 వరకు బెంగళూరులో జరిగిన ఏషియా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ అండర్-17 విభాగం మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచి చైనాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.